క్లుప్తంగా

ముంపు పొలాల పరిశీలన

ఘంటసాల(అవనిగడ్డ): భారీ వర్షాలకు నీట మునిగిన పంటపొలాల్లో మురుగు పోయేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని మొవ్వ ఏడీఏ ఎస్. శ్యామల అన్నారు. ఘంటసాల మండలం అచ్చెంపాలెంలో ముంపు పొలాలను గురువారం ఆమె పరిశీలించి మాట్లాడుతూ సంబంధిత సిబ్బందికి పలు సూచనలు చేశారు. మురుగు పోయిన తరువాత తీసుకోవాల్సిన జాగ్రత్తలను రైతులకు వివరించారు.

ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు

మచిలీపట్నంటౌన్: గిలకలదిండిలో మంగళవారం రాత్రి 10.30 గంటల సమయంలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోయింది. విద్యుత్ ఈఈ మన్నెం భాస్కరరావు స్పందించి సిబ్బందితో ట్రాన్స్‌ఫార్మర్‌ను తొలగించి నూతన ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయించారు. విద్యుత్ శాఖ వెంటనే స్పందించి కాలిపోయిన ట్రాన్స్‌ఫార్మర్ స్థానంలో నూతన ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయడంపై స్థానికులు హర్షం వ్యక్తంచేశారు.

రైతులకు సబ్సిడీపై దాణా

పెడన: పాల ఉత్పత్తిదారుల అభ్యున్నతికి కృష్ణా మిల్క్ యూనియన్ కృషి చేస్తోందని యూనియన్ చైర్మన్ చలసాని ఆంజనేయులు అన్నారు. గురువారం ఆయన పెడన, గూడూరు మండలాల్లోని తోటమూల, ఆకులమన్నాడు పాల ఉత్పత్తిదారుల సహకార సంఘాలను పరిశీలించారు. సంఘ సభ్యులు ఎందరు, పాల సేకరణ ఎంత చేసింది తదితర విషయాలను అడిగి తెలుసుకోవడంతో పాటు రికార్డులను పరిశీలించి మాట్లాడారు. పాడి రైతులకు దాణా సబ్సిడీపై అందజేస్తున్నామన్నారు.

స్వచ్ఛ సర్వేక్షణ్

పెదప్రోలు(మోపిదేవి): గ్రామీణ ప్రాంతాల్లో ప్రత్యేక బృందాల ద్వారా మరుగుదొడ్ల వినియోగంపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామని స్వచ్ఛ సర్వేక్షణ్ టీమ్ లీడర్ ముసలా రెడ్డి అన్నారు. పెదప్రోలు గ్రామంలో మరుగుదొడ్ల వినియోగంపై గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ, ఓసీ గృహాల్లోని 15 మరుగుదొడ్లను పరిశీలించి పలు సూచనలు చేశామని చెప్పారు. అనంతరం ఎస్‌డబ్ల్యూపీసీ షెడ్, పలు పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించారు. ఎంపీడీఓ రామలింగేశ్వర రావు, విస్తరణాధికారి బుర్రేపల్లి అశోక్, ఆర్‌డబ్ల్యూఎస్ జిల్లా కో–ఆర్డినేటర్, పంచాయతీ కార్యదర్శి కేటీ సుందరి, పాల్గొన్నారు.

మొక్కల పంపిణీ

గూడూరు: జిల్లా కలెక్టర్ పి.రాజాబాబు ఆదేశాల మేరకు గూడూరు జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు మొక్కలు పంపిణీ చేశారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టాలన్న కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రతి విద్యార్థికి రెండేసి మొక్కలను పీడీ మత్తి అరుణ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అరుణ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి నాటిన మొక్కకు ప్రతి రోజూ నీరు పోసి సంరక్షించాలని సూచించారు.

చంద్రబాబు, పవన్ కల్యాణ్ దిష్టిబొమ్మ దహనం



పెడన: వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి తిరిగి ఎక్కడ వస్తుందనే అక్కసుతో, ప్రజలకు చేస్తున్న మంచిని చూసి ఓర్వలేక టీడీపీ, జనసేన నాయకులు నీచ సంస్కృతికి తెరలేపుతున్నారని వైఎస్సార్ సీపీ శ్రేణులు ధ్వజమెత్తారు. గురువారం పెడనలోని బంటుమిల్లి రోడ్డులో చంద్రబాబు, పవన్ కల్యాణ్‌ల దిష్టిబొమ్మను దహనం చేశారు. వైఎస్సార్ సీపీ పట్టణ కన్వీనర్ బండారు మల్లికార్జునరావు మాట్లాడుతూ టీడీపీ, జనసేన నాయకుల తీరును ప్రజలు గమనిస్తున్నారని, రానున్న ఎన్నికల్లో గుణపాఠం తప్పదని హెచ్చరించారు. మున్సిపల్ వైస్ చైర్మన్ ఎండీ ఖాజా, ఫ్లోర్‌లీడర్ బళ్ల గంగయ్య, నాయకులు వన్నంరెడ్డి మహంకాళరావు, పామర్తి సాంబశివరావు, ఎంపీటీసీలు, కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.

పారదర్శకంగా ఓటర్ల సర్వే

బంటుమిల్లి: ఓటర్ల సర్వేను పారదర్శకంగా నిర్వహించాలని పెడన నియోజకవర్గ ఎన్నికల అధికారి, ముడా వైస్ చైర్మన్ కె. రాజ్యలక్ష్మి అన్నారు. పెదతుమ్మిడి పంచాయతీలో ఓటర్ల సర్వేను ఆమె గురువారం పరిశీలించి బీఎల్‌ఓలకు పలు సూచనలు చేశారు. ముడ డీటీ కె. నాగమల్లేశ్వరరావు, వీఆర్‌ఓలు పాల్గొన్నారు.

మోపిదేవి: ప్రతి ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులు, ఓటర్ల వివరాలు సేకరించాలని ఎలక్ట్రోరల్ రిజిస్ట్రేషన్ అధికారి వి. పార్వతి బీఎల్‌ఓలకు సూచించారు. తహసీల్దార్ కార్యాలయంలో గురువారం బీఎల్‌ఓల సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ పలు సూచనలు చేశారు. అనంతరం క్షేత్రస్థాయిలో బీఎల్‌ఓల పనితీరును పరిశీలించారు. తహసీల్దార్ కె. నవీన్‌కుమార్, నియోజకవర్గ ఎన్నికల డీటీ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న ఇంద్ర ధనస్సు



అవనిగడ్డ: మండల పరిధి గుడివాకవారిపాలెం వద్ద గురువారం ఏర్పడిన ఇంద్ర ధనస్సు ప్రకృతి ప్రేమికులను విశేషంగా ఆకట్టుకుంది. ఇరువైపులా భూమాతను తాకి ఆకాశంలో సప్త వర్ణాలతో బహు సుందరంగా కనిపించింది. ఈ దృశ్యాన్ని ప్రజలు ఆసక్తిగా తిలకించారు.

రైతు శ్రేయస్సే ప్రభుత్వ లక్ష్యం

- ముంపు పొలాలను పరిశీలించిన ఎమ్మెల్యే సింహాద్రి
- టీడీపీ హయాంలో రైతులను పట్టించుకోలేదు
- చంద్రబాబు రైతు బకాయిలు జగన్ ప్రభుత్వం చెల్లించింది
- కల్లబొల్లి మాటలతో రైతులను మభ్యపెట్టాలను కోవద్దని హితవు



నీట మునిగి కుళ్లిపోయిన వరి దుబ్బును ఎమ్మెల్యే సింహాద్రికి చూపుతున్న రైతులు

ఘంటసాల(అవనిగడ్డ): గతంలో వర్షాలు, వరదలకు పంట దెబ్బతిన్న రైతులను వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఆదుకుందని, రైతు శ్రేయస్సే లక్ష్యంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పని చేస్తున్నారని అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు అన్నారు. ఘంటసాల మండల పరిధి కొడాలి, అచ్చెంపాలెం, తెలుగురావుపాలెంలో వర్షాలకు నీట మునిగిన వరిపొలాలు, నారుమళ్లను ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు గురువారం పరిశీలించి మాట్లాడారు. గత చంద్రబాబు పాలనలో వరదలు, వర్షాల వల్ల నష్టపోయిన రైతులకు పరిహారం ఇచ్చింది లేదన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సీఎం అయిన నాటి నుంచి వర్షాలు, వరదల వల్ల నష్టపోయిన రైతులకు పరిహారం అందించారని చెప్పారు. గతంలో పంట దెబ్బతిన్న రైతులను పట్టించుకోని బుద్ధప్రసాద్ నేడు ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో రైతుల పట్ల మొసలి కన్నీరు కారుస్తున్నారని ఎద్దేవా చేశారు. రైతు సంక్షేమం కోసం పనిచేస్తున్న సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి తప్పకుండా రైతులకు న్యాయం చేస్తారని చెప్పారు. మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు, మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు, మండలి బుద్ధప్రసాద్ ప్రకృతి విపత్తులు, వర్షాలను అడ్డం పెట్టుకుని ప్రభుత్వంపై విమర్శలు చేయడం ఎంతవరకు సమంజసమన్నారు. వందేళ్ల పాటు రైతులు ముంపు బారిన పడకుండా ఉండేందుకు డెల్టా ఆధునీకీకరణ పనులు చేపడితే, రైతులకు ఉపయోగ పడే పనులు వదిలేసి కాంట్రాక్టర్‌కు లబ్ధి చేకూరేలా పనులు చేయించిన బుద్ధప్రసాద్ నేడు రైతుల కోసం కల్లబొల్లి ప్రకటనలు చేస్తున్నారని ఎమ్మెల్యే సింహాద్రి విమర్శించారు. ఏఎంసీ చైర్మన్ వేమూరి వెంకట్రావ్, జెడ్పీటీసీ తుమ్మల మురళీకృష్ణ, మండల సచివాలయ కన్వీనర్ వేమూరి ప్రవీణ్, సర్పంచ్ రాచూరి ప్రసాద్‌బాబు, ఇరిగేషన్ ఏఈ పి. వెంకటేశ్వరరావు, తహసీల్దార్ బి. రామానాయక్ పాల్గొన్నారు.

ముమ్మరంగా ముంపునీటి తరలింపు

బందరులో 15 మోటార్లతో ముంపు నీటి తోడకం



బందరు ఆదర్శ నగర్‌లో ప్రధాన డ్రెయిన్‌లోకి ఆయిల్ ఇంజిన్‌తో తరలిస్తున్న ముంపునీరు



పెడన డీటీపాలెంలో ఏర్పాటుచేసిన మోటారును పరిశీలిస్తున్న ప్రసాద్ తదితరులు

మచిలీపట్నంటౌన్: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా గత నాలుగు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు బందరు శివారు ప్రాంతాల్లోని పలు కాలనీలు ముంపుబారిన పడ్డాయి. కాలనీల్లో నిలిచిన నీటిని మేజర్ డ్రెయిన్లలోకి తోడేందుకు ఎమ్మెల్యే పేర్ని వెంకట్రామయ్య (నాని) చర్యలు చేపట్టారు. ముంపు నీటిని ఆయా ప్రాంతాల్లోని మేజర్ డ్రెయిన్లలోకి తోడేలా చర్యలు తీసుకోవాలని ఆయన నగర కమిషనర్ జి. చంద్రయ్యను ఆదేశించారు. నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో నగరంలో ముంపుబారిన పడిన సుందరయ్య నగర్, గుమస్తాల కాలనీ, టెంపుల్ కాలనీ, అరుణోదయ కాలనీ, ఆదర్శ నగర్, దేశాయిపేట, శారదా నగర్ తదితర ప్రాంతాల్లో ఆయిల్ ఇంజిన్లను ఏర్పాటు చేసి ముంపునీటిని తోడే పనులను గురువారం యుద్ధప్రాతిపదికన చేపట్టారు. సుమారు 15 మోటార్లను ఏర్పాటు చేసి నీటిని తోడుతున్నారు. కొన్ని డివిజన్లలో బుధవారం నుంచే మోటార్లను ఏర్పాటు చేశారు. గురువారం ఉదయం నుంచి ఎండకాసి వర్షం లేకపోవడంతో నగర ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. నగరంలోని ఈడేపల్లి, సబ్‌జైలు, ఫత్తుల్లాబాద్ ప్రధాన డ్రెయిన్లు, ప్రధాన రహదారుల్లో డ్రెయిన్లు పొంగి ప్రవహించాయి. మధ్యాహ్నం ఆకాశం మేఘావృతమై చిన్నపాటి జల్లులు కురిసినా ఆ తరువాత ఎండకాసింది. నగరంలోని ముంపునీరు సజావుగా పారేలా శివారు ప్రాంతాల్లోని పలు డ్రెయిన్లలో పూడికతీత పనులు చేశారు.

పెడనలో..

పెడన: పెడనలోని లోతట్టు ప్రాంతాల్లో నిలిచిన నీరు కొన్ని చోట్ల బయటకు పోతుండగా.. మరికొన్ని చోట్ల మోటార్లు ఏర్పాటు చేసి తోడించేలా పాలకులు, అధికారులు చర్యలు చేపట్టారు. మున్సిపల్ చైర్‌పర్సన్ కటకం నాగకుమారి ఆదేశాలతో మున్సిపల్ కమిషనర్ మహేంద్ర 18, 19, 20 వార్డులకు సంబంధించి దక్షిణ తెలుగుపాలెంలో మోటారు ఏర్పాటు చేసి నీటిని బయటకు పంపించేలా చర్యలు తీసుకున్నారు. సీనియర్ కౌన్సిలర్ కటకం ప్రసాద్‌తో పాటు ఆయా వార్డుల కౌన్సిలర్లు శిరివెళ్ల జయేష్, కొసనం కరుణకుమారి, నాయకులు మోటారు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

రోడ్డుకు అడ్డంగా కూలిన భారీ చెట్టు



బంటుమిల్లి–గుడివాడ రోడ్డుకు అడ్డంగా కూలిన చెట్టు

బంటుమిల్లి: మండల పరిధి నాగేశ్వరరావుపేట పంచాయతీ శివారు లక్ష్మీనారాయణపురం గ్రామం వద్ద బుధవారం అర్ధరాత్రి బంటుమిల్లి–గుడివాడ ఆర్‌అండ్‌బీ రోడ్డుపై పెద్ద నిద్రగన్నేరు చెట్టు కూలిపోయింది. గత నాలుగు రోజులుగా కురుస్తున్న ఎడతెరిపిలేని వర్షాలకు గ్రామ సమీపంలోని బ్రాంచి కాలువల్లో నీరు నిలిచి సమీపంలోని ఇళ్లల్లోకి ఊట వచ్చింది. దీంతో రోడ్డు సమీపంలోని చెట్టు నీటి ఊటకు ఎటువంటి గాలి లేకుండానే కూలిపోయింది. చెట్టు విద్యుత్ తీగలపై పడటంతో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. చెట్టు రోడ్డుకు అడ్డంగా కూలిపోవడంతో ఇరువైపులా వాహనాలు పెద్ద ఎత్తున నిలిచిపోయాయి. ప్రయాణికులు ఇబ్బందులకు గురయ్యారు. చెట్టు పడిపోయిన విషయాన్ని గురువారం ఉదయం సాక్షి ఆర్‌అండ్‌బీ జేఈ కిషోర్ దృష్టికి తీసుకువెళ్లడంతో ఆయన గ్రామస్తులతో కలిసి చెట్టును తొలగించి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. విద్యుత్ ఏఈ రవికుమార్ సిబ్బందితో కలిసి కొత్త స్తంభాలు ఏర్పాటు చేసి విద్యుత్‌లైన్‌కు మరమ్మతులు చేయించి సరఫరాను పునరుద్ధరించారు.

ఆకట్టుకున్న సైన్స్ ఎగ్జిబిషన్



మచిలీపట్నంటౌన్: నగరంలోని కేంద్రియ విద్యాలయంలో విద్యార్థులు గురువారం పలు సైన్స్ అంశాలను ప్రదర్శించారు. ఈ ప్రదర్శనను స్కూల్ విద్యార్థిని, విద్యార్థులు సందర్శించి ఆయా అంశాలపై అవగాహన పెంచుకున్నారు. పలు వ్యాధులతో, రుగ్మతలతో సతమతమవుతున్న మానవాళి చిరుధాన్యాలతో తయారుచేసిన ఆరోగ్యకరమైన వంటకాలు తీసుకోవాలని వివరిస్తూ పలు వంటకాలను విద్యార్థులు స్వయంగా తయారు చేసి ప్రదర్శించారు. నీటిని శుద్ధి చేసే అంశాన్ని ఎనిమిదో తరగతి విద్యార్థి జె. చైతన్య వివరించాడు. సూర్యుడు, భూమి, చంద్రుడు వివిధ కక్ష్యల్లో ఉన్న సమయంలో జరిగే పరిణామాల వివరాలను ఐదో తరగతి విద్యార్థి చైతన్ వివరించాడు. ఇంటిపై పడిన వర్షం నీటిని ఒడిసిపట్టి భూగర్భ జలాలను పెంపుదల చేసే అంశాన్ని నాలుగో తరగతి విద్యార్థి ఎం. సతీష్ వివరించాడు. పలువురు విద్యార్థులు మరిన్ని ప్రదర్శనలు ఇచ్చారు. ఎగ్జిబిట్లను ప్రదర్శించిన విద్యార్థులను విద్యాలయం ప్రిన్సిపాల్ జె. సత్యనారాయణ, ప్రధానోపాధ్యాయిని గ్లోరీ స్వరూపరాణి అభినందించారు.

జాతీయ విద్యా విధానంతో విద్యార్థులకు మేలు

మచిలీపట్నంటౌన్: జాతీయ విద్యా విధానం– 2020తో విద్యార్థులకు ఎంతో మేలు జరుగుతుందని స్థానిక కేంద్రియ విద్యాలయం ప్రిన్సిపాల్ జె. సత్యనారాయణ అన్నారు. కేంద్రియ విద్యాలయంలో గురువారం జాతీయ విద్యావిధానం–2020 మూడవ వార్షికోత్సవం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మచిలీపట్నంలోని కేంద్రియ విద్యాలయం, మచిలీపట్నం పీఎంశ్రీ పాఠశాలల్లో నూతన విద్యా విధానం అమలు చేస్తున్నామన్నారు. పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు, నైపుణ్య కేంద్రాలు, డిజిటల్ పరికరాలను ఏర్పాటు చేశామని చెప్పారు. అలాగే స్కిల్ ల్యాబ్‌లు, డిజిటల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ తదితర సౌకర్యాలు ఏర్పాటు చేశామన్నారు. విద్యార్థుల్లో నెలకొన్న విభిన్న ప్రతిభలు, బహు భాషా అవసరాలు, విభిన్న విద్యా సామర్థ్యాలను పెంపొందిస్తామని వివరించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయిని గ్లోరీ స్వరూపరాణి, సీనియర్ ఉపాధ్యాయుడు ఆర్. విజయకుమార్ సిబ్బంది పాల్గొన్నారు.

పంట రుణాలు సులువుగా అందేలా కృషి

కేడీసీసీబీ డైరెక్టర్ తలుపుల

గూడూరు: డైరెక్టర్‌గా తనకు అప్పగించిన బాధ్యతలను సమర్థంగా నిర్వర్తించి రైతులకు సులువుగా పంట రుణాలు అందించేందుకు కృషి చేస్తానని కేడీసీసీబీ డైరెక్టర్ తలుపుల వెంకట కృష్ణారావు అన్నారు. విజయవాడలో నిర్వహించిన కేడీసీసీబీ పాలకవర్గ ప్రమాణ స్వీకారానికి తలుపుల వెంకట కృష్ణారావు భారీ ర్యాలీగా వెళ్లారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి డైరెక్టర్‌గా అవకాశం కల్పించిన రాష్ట్ర గృహ నిర్మాణ శాఖా మంత్రి జోగి రమేష్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆశయాలకు అనుగుణంగా మంత్రి జోగి రమేష్ ఆదేశాలను పాటిస్తూ పంట రుణాలు పొందడంలో రైతులకు ఎలాంటి ఇబ్బంది కలుగకుండా చర్యలు తీసుకుంటానన్నారు. ఈ సందర్భంగా తలుపుల వెంకట కృష్ణారావును జెడ్పీటీసీ సభ్యుడు వేముల సురేష్ రంగబాబు, ఆర్బీకే చైర్మన్ పర్లం మహాలక్ష్మయ్య నాయుడు, వైస్ ఎంపీపీ నేతల కుటుంబరావు, ఎంపీటీసీ సభ్యులు జక్కా ధర్మారాయుడు, కోళ్ల లక్ష్మణరావు, సర్పంచులు గుడివాడ సుబ్రహ్మణ్యేశ్వరరావు, మండలంలోని వివిధ గ్రామాల పీఏసీఎస్ చైర్మన్లు ఘనంగా సత్కరించారు.

నేత, కలంకారీ కార్మికులను ఆదుకోవాలి

పెడన: అధిక వర్షాలకు చేనేత, కలంకారీ కార్మికులకు పనుల్లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని సీపీఎం ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి గోరురాజు అన్నారు. గురువారం స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడారు. చేనేత, కలంకారీ కార్మికులను ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. సమావేశంలో సీపీఎం నాయకులు సజ్జా నాగేశ్వరరావు, పంచల నరసింహారావు, వాసా గంగాధర్ పాల్గొన్నారు.

పెందుర్రు డ్రెయిన్‌లో తూడు, గుర్రపు డెక్క తొలగింపు



పెందుర్రు డ్రెయిన్‌లో తూడు తొలగిస్తున్న పొక్లెయిన్

బంటుమిల్లి: పెందుర్రు మీడియం డ్రెయిన్‌లో తూడు, గుర్రపు డెక్క తొలగింపు పనులు గురువారం ప్రారంభమయ్యాయి. గత నాలుగు రోజులుగా కురిసిన ఎడతెరిపిలేని వర్షాలకు నీట మునిగిన పంట పొలాలను ఈనెల 25వ తేదీన పరిశీలించిన రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్ డ్రెయిన్లలో పేరుకుపోయిన తూడు, గుర్రపుడెక్క తొలగింపు పనులు వెంటనే చేపట్టాలని ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. ఈ మేరకు అధికారులు తొలగింపు పనులను పెందుర్రు డ్రెయిన్‌లో రామన్నమోడి వంతెన నుంచి మల్లంపూడి మేజర్ డ్రెయిన్ వరకు చేపట్టారు. పనులను వైఎస్సార్ సీపీ నాయకులు వెంకటేశ్వరరావు, బుజ్జి, సుందరయ్య, మల్లేశ్వరరావు, నాని, నాగబాబు, ఏఈఈ నాగేశ్వరరావు పర్యవేక్షిస్తున్నారు. మంత్రి జోగి రమేష్ స్పందించడంతో వెంటనే పనులు ప్రారంభమయ్యాయని రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

వడ్లమన్నాడు డ్రెయిన్‌లో..

గూడూరు: వడ్లమన్నాడు డ్రెయిన్‌లో గుర్రపుడెక్క తొలగింపు పనులు గురువారం ప్రారంభమయ్యాయి. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు వడ్లమన్నాడు డ్రెయిన్‌లో గుర్రపుడెక్క దట్టంగా పేరుకుపోవడంతో నీరు కిందికి పారడంలేదు. ఈ సమస్యను స్థానిక రైతులు ఎంపీటీసీ సభ్యుడు వై.శ్రీనివాసరావు, ఆర్బీకే చైర్మన్ సమ్మెట నాని, మహంకాళమ్మ ఆలయ చైర్మన్ సమ్మెట వేణుల ద్వారా గృహ నిర్మాణ శాఖా మంత్రి జోగి రమేష్ దృష్టికి తీసుకువెళ్లారు. వర్షాన్ని సైతం లెక్క చేయకుండా అధికారులతో కలిసి గ్రామానికి వచ్చిన మంత్రి జోగి రమేష్ వెంటనే గుర్రపుడెక్క తొలగింపు పనులు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. దీనిపై స్పందించిన అధికారులు జేసీబీతో గుర్రపు డెక్క తొలగింపు పనులు చేపట్టారు. దీనిపై రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ప్రభుత్వ సేవలు సద్వినియోగం చేసుకోవాలి

బందరు తహసీల్దార్ శ్రీవిద్య



కోడూరులో సర్టిఫికెట్లను అందిస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు

కోనేరుసెంటర్: ప్రభుత్వ సేవలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకుని అవసరమైన ధ్రువీకరణ పత్రాలను పొందాలని బందరు తహసీల్దార్ ఎం. శ్రీవిద్య అన్నారు. అరిశేపల్లి, వాడపాలెం గ్రామాల్లో గురువారం జగనన్న సురక్ష శిబిరాలు నిర్వహించారు. అరిశేపల్లిలో 200 ధ్రువీకరణ పత్రాలను, వాడపాలెంలో 826 ధ్రువీకరణ పత్రాలను అందజేసి మాట్లాడారు. ఎంపీడీఓ ఎం. బాలకృష్ణ, డెప్యూటీ తహసీల్దార్ శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ గ్రామ ఇన్‌చార్జి చండిక అజయ్, వాడపాలెం, కేపీటీ పాలెం సర్పంచ్‌లు, ఉప సర్పంచ్‌లు పాల్గొన్నారు.

మచిలీపట్నంటౌన్: జగనన్న సురక్ష కార్యక్రమంలో అర్హులైన లబ్ధిదారులకు పలు రకాల ధ్రువీకరణ పత్రాలు ఉచితంగా అందజేస్తున్నామని వైఎస్సార్ సీపీ యువజన విభాగం జోనల్ ఇన్‌చార్జి పేర్ని కృష్ణమూర్తి (కిట్టు) అన్నారు. నగరంలోని పలు డివిజన్లలో గురువారం జగనన్న సురక్ష శిబిరాలు నిర్వహించి సర్టిఫికెట్లు అందజేశారు. కార్పొరేటర్ భోగాది సాయిరఘువిఠల్, కో–ఆప్షన్ సభ్యుడు బేతపూడి రవి, పలు డివిజన్ల కార్పొరేటర్లు, వైఎస్సార్ సీపీ డివిజన్ ఇన్‌చార్జీలు, నాయకులు పాల్గొన్నారు.

కోడూరులో 557 సర్టిఫికెట్ల పంపిణీ..

కోడూరు: కోడూరు–1 సచివాలయ పరిధికి సంబంధించి స్థానిక పంచాయతీ కార్యాలయం వద్ద జగనన్న సురక్ష శిబిరం గురువారం నిర్వహించారు. 557 మందికి ఉచితంగా సర్టిఫికెట్లను అందజేశారు. జెడ్పీటీసీ యాదవరెడ్డి వెంకట సత్యనారాయణ, ఎంపీపీ కొండవీటి వెంకటకుమారి, సర్పంచి వెన్నా షైనీ, ఎంపీడీఓ పాండురంగారావు, తహసీల్దార్ షేక్ లతీఫ్‌పాషా, ఎంపీటీసీ బడే గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు కథల పోటీలు

మచిలీపట్నంటౌన్: స్థానిక జిల్లా గ్రంథాలయ సంస్థ మీటింగ్‌హాల్‌లో గురువారం విద్యార్థులకు కథల పోటీలు నిర్వహించారు. టీటీడీ ధర్మప్రచార పరిషత్, జిల్లా గ్రంథాలయ సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో పోటీలను జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి వేములపల్లి రవికుమార్ ప్రారంభించారు. సీనియర్స్ విభాగంలో 62 మంది, జూనియర్స్ విభాగంలో 37 మంది పాల్గొన్నారు. జిల్లా స్థాయిలో జరిగిన ఈ పోటీల్లో పలు మండలాలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు. విజేతలకు నగదు బహుమతులు అందజేశారు.

నేడు విస్తృతంగా మొక్కలు నాటాలి

కలెక్టర్ రాజాబాబు ఆదేశం



రిజిస్ట్రేషన్ అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ రాజాబాబు

చిలకలపూడి(మచిలీపట్నం): జిల్లా వ్యాప్తంగా శుక్రవారం మొక్కలు నాటే కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున చేపట్టాలని కలెక్టర్ పి. రాజాబాబు అధికారులను ఆదేశించారు. గురువారం అధికారులతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో పర్యావరణ పరిరక్షణలో భాగంగా పచ్చదనం పెంపుదల కోసం విస్తృతంగా మొక్కలు నాటాల్సిన అవసరం ఉందన్నారు. శుక్రవారం అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, సచివాలయాల ఆవరణల్లో పెద్ద ఎత్తున మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించాలని చెప్పారు. ఇందుకు సమీపంలోని నర్సరీల నుంచి కావాల్సిన మొక్కలను తెచ్చుకుని సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమాన్ని ఒక్క రోజుతో సరిపెట్టకుండా వాటి సంరక్షణ బాధ్యతలు కూడా చూసుకోవాలన్నారు. ముఖ్యంగా మహిళలు ఈ కార్యక్రమంలో అత్యధికంగా పాల్గొనేలా చూడాలన్నారు. గ్రామ, వార్డు సచివాలయ కార్యదర్శులు, స్వయం సహాయక సంఘాల మహిళలు, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఉపాధి హామీ క్షేత్ర సహాయకులు, ఎంఈఓలు, ప్రధానోపాధ్యాయులు ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు చొరవ చూపాలని కోరారు. సంబంధిత ఎంపీడీఓలు, అటవీ శాఖ జిల్లా అధికారి, ఐసీడీఎస్, డీఆర్డీఏ, డ్వామా, ఉద్యాన శాఖాధికారులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. జిల్లాలోని డ్రెయిన్లలో పూడికలు తొలగించే పనిని ఏ కాంట్రాక్టర్లకు అప్పగించారు, ఏ డ్రెయిన్ల కారణంగా పంట పొలాలు మునిగాయో వాటి వివరాలను వెంటనే అందజేయాలన్నారు. ఎన్ని రకాల పంటలు నీట మునిగాయో అంచనా వేసి నష్టం వివరాలు తెలియజేసే తాత్కాలిక నివేదికను వ్యవసాయాధికారులు అందజేయాలని చెప్పారు. మచిలీపట్నం నగర పాలక సంస్థ పరిధిలోని పేదలందరికీ ఇళ్ల నిర్మాణ కార్యక్రమంలో భాగంగా 4 వేల మంది స్వయం సహాయక సంఘాల మహిళలకు వెంటనే రుణాలు అందజేసి గృహాల నిర్మాణ పురోగతిని వేగవంతం చేయాలని సూచించారు. టెలీ కాన్ఫరెన్స్‌లో జేసీ అపరాజితసింగ్, డీఆర్వో వెంకటేశ్వర్లు, డీఎఫ్‌ఓ రాజశేఖర్, డీఈఓ తాహెరా సుల్తానా తదితరులు పాల్గొన్నారు.

డివిజన్ల వారీగా అధికారుల నియామకం..

జిల్లా వ్యాప్తంగా మొక్కలు నాటే కార్యక్రమానికి ఆయా డివిజన్ల వారీగా పర్యవేక్షణాధికారులను నియమిస్తూ జాయింట్ కలెక్టర్ అపరాజితసింగ్ ఉత్తర్వులు జారీ చేశారు. మచిలీపట్నం డివిజన్‌కు ఎంయూడీఏ వైస్ చైర్మన్ కె. రాజ్యలక్ష్మి, గుడివాడ డివిజన్‌కు గుడివాడ ఆర్డీఓ ఎ. పద్మావతిని నియమించారు. ఉయ్యూరు డివిజన్‌కు జిల్లా పౌరసరఫరాల అధికారి వి. పార్వతిని, ఓవరాల్ ఇన్‌చార్జీలుగా ఉద్యాన శాఖ ఏడీ జె. జ్యోతి, జిల్లా ఫారెస్ట్ ఆఫీసర్ రాజశేఖర్‌ను నియమించారు.

రిజిస్ట్రేషన్ శాఖ ఆదాయం పెంచుకోండి..

చిలకలపూడి(మచిలీపట్నం): జిల్లాలో చాలా ప్రాంతాల్లో భూముల ధరలు ప్రభుత్వం నిర్దేశించిన ధరకు, మార్కెట్ రేటుకు వ్యత్యాసం ఉన్న నేపథ్యంలో అందుకు అనుగుణంగా రిజిస్ట్రేషన్ శాఖ అధికారులు ఆదాయం పెంచుకునేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ పి. రాజాబాబు అన్నారు. ఆయన చాంబర్‌లో గురువారం జరిగిన సమావేశంలో మాట్లాడారు.

మార్కెట్ ధరకు, ప్రభుత్వ ధరకు 40 నుంచి 50 శాతం వ్యత్యాసం ఉందని, దీనిపై ఆయా ప్రాంతాల్లో ఉన్న ధరలను ఉన్నతాధికారులకు తెలియజేసి రిజిస్ట్రేషన్ శాఖకు ఆదాయం వచ్చేలా చూడాలన్నారు. గన్నవరానికి చెందిన పలు భూముల విషయంలో కూడా ఈ విధంగా వ్యత్యాసం ఉందని చెప్పారు. సమావేశంలో రిజిస్ట్రేషన్ శాఖ డెప్యూటీ ఇన్‌స్పెక్టర్ జనరల్ రవీంద్రనాథ్, జిల్లా రిజిస్ట్రార్ బీఎస్ఆర్ ప్రసాద్, గన్నవరం సబ్ రిజిస్ట్రార్ కె. వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

భారత ఖ్యాతిని విశ్వవ్యాప్తం చేసిన అబ్దుల్ కలాం

ఏపీ రైతు విభాగం జోనల్ ఇన్‌చార్జి కడవకొల్లు



అబ్దుల్ కలాం చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కడవకొల్లు, నాయకులు

అవనిగడ్డ: మాజీ రాష్ట్రపతి దివంగత అబ్దుల్ కలాం భారత దేశ ఖ్యాతిని విశ్వవ్యాప్తం చేశారని ఏపీ రైతు విభాగం జోనల్ ఇన్‌చార్జి కడవకొల్లు నరసింహారావు అన్నారు. కలాం వర్ధంతి కార్యక్రమం దివిసీమలోని పలు ప్రాంతాల్లో గురువారం ఘనంగా నిర్వహించారు. స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయం వద్ద జరిగిన కార్యక్రమంలో కలాం చిత్రపటానికి కడవకొల్లు నరసింహారావు పూలమాల వేసి నివాళులర్పించారు. కడవకొల్లు మాట్లాడుతూ రాష్ట్రపతిగా, శాస్త్రవేత్తగా అబ్దుల్ కలాం దేశానికి అందించిన సేవలు ఎనలేనివన్నారు. ఆయన నిరాడంబరత, దేశభక్తి అందరికీ ఆదర్శనీయమని చెప్పారు. ఇలాంటి మహనీయుల జీవితాలను ఆదర్శంగా తీసుకుని యువత అన్ని రంగాల్లో రాణించాలని పిలుపు నిచ్చారు. ఏఎంసీ చైర్మన్ కొక్కిలిగడ్డ వీర వెంకటేశ్వరరావు, ఎంపీపీ తుంగల సుమతీదేవి, జెడ్పీటీసీ చింతలపూడి లక్ష్మీనారాయణ, సర్పంచ్ గొరుముచ్చు ఉమా, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ అధికార ప్రతినిధి సింహాద్రి వెంకటేశ్వరరావు, మండల కోఆప్షన్ సభ్యులు షేక్ నజీర్‌బాషా, నాగాయలంక మండల సచివాలయ కన్వీనర్ మద్ది చిన్నా, పట్టణ కన్వీనర్ అన్నపరెడ్డి రాందాస్, నాయకులు పాల్గొన్నారు.

చల్లపల్లి: స్థానిక విజయా హైస్కూల్‌లో కలాం విగ్రహానికి ప్రిన్సిపాల్ నాగళ్ల భీమారావు పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, కలాం అభిమానులు పాల్గొన్నారు.

లారీ డ్రైవర్ నిర్లక్ష్యంతో తెగిపడిన విద్యుత్ వైర్లు

బంటుమిల్లి: సిమెంటు దిగుమతి చేసేందుకు వచ్చిన లారీ డ్రైవర్ నిర్లక్ష్యం కారణంగా గురువారం విద్యుత్ శాఖకు రూ. 2 లక్షల నష్టం కలిగింది. విద్యుత్ ఏఈఈ రవికుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. స్థానిక శివాలయం సమీపంలో నిర్మాణంలో ఉన్న అపార్టుమెంట్ వద్ద సిమెంట్ దిగుమతి చేసేందుకు వచ్చిన పెద్ద లారీ దారి సౌకర్యం లేక వెనుకకు తిరుగుతున్న సమయంలో వెనుక డోరు విద్యుత్ స్తంభానికి పట్టుకుంది. డ్రైవర్ కంగారుపడి లారీని ముందుకు పోనిచ్చాడు. దీంతో ఏడు విద్యుత్ స్తంభాల వైర్లు తెగిపడ్డాయి. అధికారులు విద్యుత్‌సరఫరాను నిలిపివేసి ఘటనాస్థలానికి చేరుకుని విచారణ చేశారు. రూ. 2 లక్షల మేర విద్యుత్‌శాఖకు నష్టం కలిగిందని అధికారులు తెలిపారు.

మానవ అక్రమ రవాణా నేరం

మచిలీపట్నంటౌన్: మానవ అక్రమ రవాణా నేరమని, ఇలాంటి చర్యలకు పాల్పడే వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటారని చైల్డ్ రైట్స్, యు సంస్థ ప్రతినిధులు అన్నారు. ప్రపంచ మానవ అక్రమ రవాణా వ్యతిరేక వారోత్సవాల్లో భాగంగా గురువారం నగరంలోని లేడియాంప్తిల్ ప్రభుత్వ జూనియర్ కళాశాల, గిలకలదిండిలోని మునిసిపల్ ఉన్నత పాఠశాలల్లో మానవ అక్రమ రవాణాపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో విద్యాసంస్థల ప్రతినిధులు, చైల్డ్ రైట్స్, యు సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.